క్లుప్తంగా

ఆర్ఎంపీలు నిస్వార్థంగా సేవలు అందించాలి

ప్రత్తిపాడు: ఆర్ఎంపీ, పీఎంపీలు నిస్వార్థంగా సేవలు అందించాలని చిట్టికొండ నర్సింగ్ హోం అధినేత డాక్టర్ అందే చిట్టికొండ కోరారు. స్థానిక చిట్టికొండ నర్సింగ్ హోంలో బుధవారం నియోజకవర్గ ఆర్ఎంపీ, పీఎంపీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రులు లేని గ్రామాల్లో వైద్య సేవలు అందించేది ఆర్ఎంపీలే అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలపై చర్చించారు. అనంతరం నియోజకవర్గ పీఎంపీల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంఘ అధ్యక్షుడిగా ప్రసాద్

ప్రత్తిపాడు నియోజకవర్గ పీఎంపీల సంఘ అధ్యక్షుడిగా ఏలేశ్వరం మండలం యర్రవరానికి చెందిన గుండేపల్లి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా ఇందన సత్తి వీర్రాజు (శంఖవరం మండలం కత్తిపూడి), ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ (ప్రత్తిపాడు మండలం శరభవరం), కోశాధికారిగా యాతం గోవిందు (ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి)లతో పాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో బుధవారం రెండోరోజు ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. తక్షణమే పీఆర్సీ కమిషన్ వేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే ఇవ్వాలని, ఖాళీగా ఉన్న సుమారు 8 వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

తుని: ఆర్టీసీలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

ప్రజా సమస్యలు తీర్చలేకే బెదిరింపులు

కిర్లంపూడి: ప్రజా సమస్యలు తీర్చమని అడిగితే తట్టుకోలేక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తన కార్యకర్తలతో ప్రెస్‌మీట్‌లు పెట్టించి బెదిరిస్తున్నారని సామాజిక కార్యకర్త పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. ఈ మేరకు బూరుగుపూడిలో గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు తదితర సమస్యలను అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తానని గతంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రజలకు వాగ్దానాలు చేశారని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడిగితే టీడీపీ కార్యకర్తలతో ప్రెస్‌మీట్‌లు పెట్టించి ప్రశ్నిస్తే నాలుక కోస్తాం, కుమ్మేస్తాం, గ్రామాల్లో తిరగనివ్వమని బెదిరిస్తున్నారన్నారు. ఇటువంటి బెదిరింపులకు దిగితే తాను మరింత ఉత్సాహంగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని సూర్యచంద్ర తెలిపారు.

కత్తిపూడిలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో సీతారామా కళాశాల విద్యార్థులు బుధవారం జాతీయ జెండాలతో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు కళాశాల నుంచి బస్‌స్టేషన్ వరకూ ర్యాలీ చేసి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ వీరబాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం జాతీయ నాయకులు చేసిన పోరాటాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అక్కారావు, బీజేపీ నాయకులు గంటా బాలుదొర తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచశాంతికి విశ్వ హిందూ పరిషత్ కృషి

గండేపల్లి: ప్రపంచమంతా శాంతి, సౌభాగ్యాలతో సుభిక్షంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని విశ్వ హిందూ పరిషత్ సభ్యులు అన్నారు. గండేపల్లి శివాలయంలో బుధవారం విశ్వ హిందూ పరిషత్ మండల సమావేశం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ధర్మ ప్రచారం, దేశ రక్షణ కోసం గ్రామ కమిటీలను నియమించినట్టు సంఘ మండల అధ్యక్షుడు మావిరెడ్డి వీరభద్రరావు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పి.చిరంజీవి రాంబాబు, సత్యనారాయణ, శివ, అనంత్, దయానంద సరస్వతి, బ్రహ్మాజీ, వీరమళ్ల సూరిబాబు, మహిళలు పాల్గొన్నారు.

సత్యగిరి నుంచి ఆదిశంకర్ మార్గ్‌కు సీసీ రోడ్డు నిర్మాణం

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సత్యగిరి జంక్షన్ నుంచి ఆదిశంకర్‌మార్గ్‌కు సీసీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. రూ.6 లక్షలతో ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే సత్యగిరి నుంచి భక్తుల వాహనాలు నేరుగా ఆదిశంకర మార్గ్‌లోకి వెళ్లే వీలు కలుగుతుంది. ప్రస్తుతం ఒకే రోడ్డు ఉండడం వలన సత్యగిరికి వెళ్లే వాహనాలు, దిగువకు వచ్చే వాహనాలు ఒకదానికొకటి ఎదురుపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం వారంలో పూర్తవుతుందని ఈఈ రామకృష్ణ తెలిపారు.

వాన కురిసె.. రైతు మురిసె..

- మెట్టలో జోరువాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన నారుమడులు



తుని వద్ద తాండవ మినీ రిజర్వాయర్ కట్టడం పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీవర్షం పడింది. కొద్దిరోజులుగా ఎండలతో అల్లాడుతున్న ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. మెట్ట గ్రామాల్లో నారుమడులు ఎండిపోతున్న తరుణంలో వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు నారుమళ్లు నీట మునిగాయి. మరిన్ని వర్షాలు పడితే ఖరీఫ్‌లో తాము గట్టెక్కుతామని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రహదారులు జలమయం

రౌతులపూడి: మండలవ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి గ్రామీణ రహదారులు జలమయమయ్యాయి. మండలంలోని బలరామపురం-ఎ.మల్లవరం రహదారిలో దెయ్యాల కట్టు వద్ద రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటి ప్రవాహం వలన రహదారి ప్రమాదకరంగా మారింది. మల్లంపేట నుంచి రౌతులపూడి వైపు వెళ్లే రహదారిలో ఏలేరు కాలువపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజవరం- దిగువశివాడ రహదారిపై నీరు ప్రవహించడంతో ఈ మార్గం గుండా గంగవరం, రాజవరం, దిగువశివాడ గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రౌతులపూడి హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో రహదారిపై వరద నీరు నిలిచిపోయింది. వర్షానికి ప్రమాదకరంగా మారిన రహదారులను ఎస్ఐ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఎ.మల్లవరం గ్రామస్తులు, బీబీ పట్నం మీదుగాను, మల్లంపేట గ్రామస్తులు ఎస్.పైడిపాల మీదుగా ప్రయాణించాలని సూచించారు.

చెరువులకు జలకళ

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ప్రధాన చెరువులకు జలకళ వచ్చింది. ములగపూడిలో పెద చెరువు, కుడుంపాత్రుని చెరువు, ఎ.మల్లవరం దొరచెరువు, పారుపాక గొల్లమారెమ్మ చెరువు, శృంగవరంలోని ఎర్రచెరువు, పి.చామవరంలోని గుర్రపు చెరువు మల్లంపేటలోని నల్లచెరువు, బలరామపురంలోని వెంకమ్మ చెరువులు పూర్తిగా నిండాయి. చెరువుల ఆయుకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వారపు సంతకు వర్షం దెబ్బ

ప్రత్తిపాడు: గ్రామంలో ప్రతి బుధవారం జరిగే వారపు సంతకు వర్షం దెబ్బ తగిలింది. వారపు సంత నిర్వహణకు ప్రత్తిపాడులో ప్రత్యేకంగా షెల్టర్లు లేకపోవడంతో వర్తకులు రోడ్లపైనే తమ సరుకులను విక్రయిస్తుంటారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చీపుర్లు... ఇలా అన్ని రకాల వస్తువులను రోడ్లపై వినియోగదారులను ఆకట్టుకునేలా అమర్చుతారు. వర్తకం ముమ్మరంగా సాగుతున్న వేళ హఠాత్తుగా భారీ వర్షం కురిసింది. వర్తకులు ఆదరాబాదరాగా వస్తువులను సర్దుకున్నా... కొంత మేర తడిసిపోయాయి. వర్షం సాయంత్రం వరకు కురవడంతో వ్యాపారాలు సాగక వర్తకులు నిరాశగా తిరుగుముఖం పట్టారు.

తుని రూరల్: మండలవ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. తొలకరి ప్రారంభమై రెండున్నర నెలలవుతున్న ఖరీఫ్ నాట్లు వేయని రైతులకు వర్షం ఊరటనిచ్చింది. బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం నారుమడులకు ఊపిరి పోసింది. రెండు రోజులుగా ఎగువ ప్రాంతంలోనూ, పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో తాండవ నదిలో వరదనీరు ప్రవహిస్తోంది. తుని పట్టణానికి ఎగువ, దిగువన ఉన్న రెండు మినీ రిజర్వాయర్ల కట్టడాలపై నుంచి వరదనీరు దిగువకు ప్రవహిస్తోంది. 380 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల తాండవ రిజర్వాయర్‌లో 372.74 అడుగులకు నీటి నిల్వలు చేరినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

గండేపల్లి: మండలవ్యాపంగా బుధవారం భారీ వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. నీలాద్రిరావుపేట నెహ్రూ కాలనీకి వెళ్లే మార్గంలోని జగనన్న కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై నీళ్లు చేరి బురదమయంగా మారింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అల్లకల్లోలం..

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనానికి తోడుగా అల్పపీడనం తోడవడంతో మండలంలోని సముద్రతీరంలో అలల ఉధృతి పెరిగింది. దానవాయిపేట, కొత్త చోడిపల్లిపేట, అద్దరిపేట తదితర సముద్ర తీరాల్లో అలలు రెండు నుంచి మూడు మీటర్ల ఎత్తున ఎగసిపడుతున్నాయి. దీంతో మత్స్యకారులు బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించి లంగరు వేశారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంత మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తుని ఎఫ్‌డీఓ సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు.



తొండంగి మండలం సముద్రతీరంలో సురక్షిత ప్రాంతాలకు తరలించిన బోట్లు



ఏలేశ్వరంలో నీట మునిగిన నారుమడి



బలరామపురం-ఎ.మల్లవరం రహదారిలో దెయ్యాల కట్టు వద్ద వరద ప్రవాహం

వరద ఉధృతితో రాకపోకలకు అంతరాయం



సూదికొండ శివారున ప్రధాన రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

గోకవరం: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎంత తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ సాయంత్రం 3 గంటల నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కారుమబ్బులు కమ్ముకుని ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఏజెన్సీలో కురిసిన భారీ వర్షానికి కొండ కాలువ పొంగడంతో సూదికొండ చెక్‌పోస్టు సమీపంలో ప్రధాన రహదారి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో సుమారు రెండు గంటల పాటు గోకవరం-జగ్గంపేట ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షానికి పంట పొలాల్లో నీరు చేరడంతో మెట్టలోని ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో విస్తారంగా వర్షాలు

శంఖవరం: మండలవ్యాప్తంగా రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పలు గ్రామాల్లో వరి పొలాలు నీట మునిగాయి. శంఖవరం, కత్తిపూడి, కొతంగి గ్రామాల్లో చెరువులు నిండికుండల్లా దర్శనమిస్తున్నాయి. ఈదురుగాలుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

వరినారు చివర్లు తుంచి నాట్లు వేయాలి



భీమవరపుకోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ చంద్రశేఖర్

కోటనందూరు: వరినారు చివర్లు తుంచి నాట్లు వేయడం ద్వారా కాండం తొలిచే పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని భీమవరపుకోట, జగన్నాథపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ సాగులో రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడకూడదన్నారు. ఆఖరి దమ్ములో భాస్వరం ఎరువు తప్పకుండా వేయాలని సూచించారు. మెరక భూముల్లో రాగులు, కందులు, మినుములు సాగు చేయాలని సూచించారు. రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. పంటపొలాలను సందర్శించి వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు జగ్గప్పారావు, సురేష్ పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

ఏలేశ్వరం: రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందిస్తున్నట్టు వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని యర్రవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న వ్యవసాయ యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. యూరియాతో పాటు నానో యూరియాపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి



కిర్లంపూడిలోని బాలికల సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కిర్లంపూడి: మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ తోట రవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, యూరియా కొరత, అంగన్‌వాడీ భవనాలు, గోతులు మయంగా మారిన రోడ్లు తదితర సమస్యలపై ఆయాశాఖల అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రవి అధికారులను ఆదేశించారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ జగ్గంపేట సీడీపీఓ ఎం.పూర్ణిమ ఆధ్వర్యంలో బాలికల సంరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలంటూ ప్రతిజ్ఞ చేశారు. సొసైటీ చైర్మన్లు తోట గాంధీ, కుర్ల చినబాబు, వైస్ ఎంపీపీ తోట రవి, డిప్యూటీ తహసీల్దార్ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



లోవ మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న జిల్లా అటవీ అధికారి ప్రభాకర్

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాకినాడ జిల్లా అటవీ అధికారి ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. దేవస్థానానికి వచ్చిన ఆయన తలుపులమ్మ అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అటవీ, పర్యావరణానికి అనుగుణంగా పనులు జరుగుతున్నాయా ?లేదా ? అని ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజును అడిగి తెలుసుకున్నారు. మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు.

డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన అవసరం

జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ రహిత సమాజంపై ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

తుని రూరల్: మత్తు పదార్థాల (డ్రగ్స్) రహిత సమాజంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు సూచించారు. ఐసీడీఎస్ తుని సీడీపీఓ కె.శ్రీలత ఆధ్వర్యంలో బుధవారం స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యాలయం, వి.కొత్తూరులో ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలు వాడడం వల్ల కలిగే నష్టాలు, వాటిని త్యజిస్తే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల ఆయా కుటుంబాలే కాకుండా సమాజం తీవ్రంగా నష్టపోతుందన్నారు. యువత అప్రమత్తతతో మెలగాలని, సమాజానికి ఉపయోగపడే సాంస్కృతిక, సమాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలైతే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత, సీడీపీఓ శ్రీకళ, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, విద్యార్థులు, అంగన్‌వాడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



ప్రత్తిపాడులో ఎరువుల దుకాణం యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

ప్రత్తిపాడు: రైతులకు యూరియా సరఫరా చేయలేని దయనీయ స్థితిలో ప్రభుత్వం ఉంది. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ సాగు ఆలస్యమైంది. మండలంలో సుమారు పది వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ఈ పొలాలకు సుమారు 325 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. కాగా రైతులకు వ్యవసాయ శాఖ అరకొరగా యూరియా సరఫరా చేస్తోంది. ఇప్పటివరకూ ప్రత్తిపాడు, ఏలూరు, రాచపల్లి, ఉత్తరకంచి గ్రామాల రైతు సేవా కేంద్రాలకు పది టన్నుల వంతున 40 టన్నులు యూరియా సరఫరా చేసినట్టు మండల వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు. బుధవారం ప్రత్తిపాడు రైతు సేవా కేంద్రానికి పది టన్నుల యూరియా సరఫరా చేశారు. వ్యవసాయ శాఖకు గోడౌన్ వసతి లేకపోవడంతో శ్రీసత్యదేవా ఏజన్సీస్ అండ్ ఫెర్టిలైజర్స్ షాపులో రైతులకు అందుబాటులో ఉంచారు. పది టన్నులు యూరియా ఎంత మందికి సరఫరా చేస్తారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా కొరత లేకుండా యూరియా సరఫరా చేసేవారని, ప్రస్తుతం యూరియా కోసం ఎదురుచూడాల్సి వస్తోందని ప్రత్తిపాడు ఎంపీటీసీ, రైతు సీంద్రపు భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమ ఇబ్బందులను గుర్తించి, పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

పాఠశాలల్లో వసతులను సద్వినియోగం చేసుకోవాలి

తొండంగి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని దివీస్ ల్యాబోరేటరీస్ ప్రతినిధి బి.వాసుబాబు సూచించారు. మండలంలోని ఒంటిమామిడిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దివీస్ ల్యాబోరేటరీస్ సీఎంఆర్ నిధులు రూ.6.66. లక్షలతో నిర్మించిన టాయిలెట్ బ్లాక్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. కంపెనీ ఆర్థిక సహకారంతో తీర ప్రాంత గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు.

రక్తహీతన సమస్యను నివారించాలి

తొండంగి: పిల్లల్లో రక్తహీనత సమస్యను పూర్తిగా నివారించాలని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ అన్నారు. డీ వార్మింగ్ డే సందర్భంగా బుధవారం ఏవీ నగరం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవీ నగరం పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలల్లో 2633 మంది పిల్లలకు గానూ 2367 మంది పిల్లలకు డీవార్మింగ్ మాత్రలు అందజేశామన్నారు. మరో రెండు రోజుల పాటు వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఇంటింటా పర్యటించి పిల్లలకు డీవార్మింగ్ మాత్రలు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు పి.భారతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు బుధవారం పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతల రాజు ఆధ్వర్యంలో బురదకోట పంచాయతీ బాపన్నధార గిరిజన గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పార్టీ నాయకులు ముర్ల కాశీ బాబు, ముర్ల రాజబాబు, కాకూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు దుస్తుల పంపిణీ

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు యర్రంపాలెంలో వ్యవసాయ కూలీలకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జోరుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఐవీ వీరాంజనేయులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భవిత పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

జగ్గంపేట: స్థానిక భవిత పాఠశాలకు మండలంలోని మల్లిసాలకు చెందిన ఇంజరపు దుర్గబాబు, మేరి దంపతులు బుధవారం ప్రింటర్ బహూకరించారు. వీరు ఏటా తమ పెళ్లిరోజున పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. గతంలో గండేపల్లి మండలం తాళ్లూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఇన్వర్టర్, సౌండ్ సిస్టం అందజేశారు. ఈ ఏడాది దివ్యాంగుల పాఠశాలకు ప్రింటర్ అందజేసి దివ్యాంగులకు భోజనాలు ఏర్పాటు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆప్పాల పెదకాపు, చిన బాబు, దివ్యాంగుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆకలి కేకలు

- పాఠశాలల్లో మొక్కుబడిగా మధ్యాహ్న భోజన పథకం అమలు
- అరకొర వడ్డన, అర్ధాకలితో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



తాళ్లూరు ఎంపీపీ స్కూల్ వద్ద భోజనం చేస్తున్న విద్యార్థులు

గండేపల్లి: అభం శుభం తెలియని చిన్నారులకు ఆకలేస్తే కడుపు నింపుకోవడం కోసం ఆత్రుతగా ప్లేట్లు పట్టుకొని పరుగులు తీయడమే తెలుసు. అలాంటి వారికి రుచికరమైన నాణ్యతతో కూడిన భోజనం దక్కట్లేదు. అరకొర వడ్డన, అర్ధాకలితో అలమటిస్తున్న విద్యార్థులకు మొక్కుబడిగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ జరుగుతున్న వైనమిది. మండలంలోని తాళ్లూరు ఎంపీపీ స్కూల్ వద్ద 1 నుంచి 5వ తరగతి వరకు 72 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి లేకపోవడంతో అర్ధాకలితోనే సరిపెట్టుకుంటున్నారు. ఇటీవల 68 మంది విద్యార్థులు స్కూల్‌కు హాజరు కాగా.. మెనూ ప్రకారమే భోజనాన్ని పెట్టినట్టు హెచ్ఎం నాగమణి చెప్పారు. కానీ, వాటిలో నాణ్యత అంతంత మాత్రంగానే ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ పిల్లలకు సరిపడా భోజనం అందట్లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. మరోసారి భోజనం కోసం వెళితే పథకం నిర్వాహకులు లేదని చెప్పి, కోపంతో అరుస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. మెనూ ప్రకారం వంట చేస్తున్నప్పటికీ విద్యార్థులకు మాత్రం కడుపు నిండని పరిస్థితి.



విద్యార్థులకు వడ్డిస్తున్న రంగు లేని పులిహోర



కుళాయిల వద్ద నీళ్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

నీళ్ల కోసం పడిగాపులు

మధ్యాహ్న భోజనం అనంతరం చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకునేందుకు కుళాయిల వద్ద విద్యార్థులు నీళ్ల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. సమయానికి నీళ్ల రాక ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ కోతలు, విద్యార్థుల కోసం కుళాయిలు అందుబాటులోకి తెచ్చేందుకు జరిగిన పనుల్లో జాప్యం జరిగిందని హెచ్ఎం పేర్కొన్నారు. హైస్కూల్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండటం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. హైస్కూల్, ఎంపీపీ స్కూల్ పథకం నిర్వాహకుల మార్పు, వంట సరకులు పక్కదోవ పట్టడం రెండు వర్గాల మధ్య ముదిరిన వివాదంగా మారిందని, ఇన్ని సమస్యలతో తమ పిల్లలు భోజనం ఎలా చేస్తారని తల్లిదండ్రులు వాపోతున్నారు. రుచికరమైన ఆహారం వండి పెట్టేవారిని నియమించాలని, ఉన్నతాధికారులు స్కూల్స్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు తగిన ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


నాణ్యమైన భోజనం అందేలా చూస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు కృషి చేస్తాం. మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చి రుచికరమైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటాం. పిల్లలు కడుపునిండా భోజనం తినేలా చూస్తాం.

మలిరెడ్డి శేఖర్, తాళ్లూరు, ఎస్ఎంసీ చైర్మన్

ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారు



మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత ఉండటం లేదు. అన్నం ఒక్కొక్కసారి ఉడకడం లేదు. కూరలు రుచి, సుచి లేకపోవడంతో కొందరు విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నారు. భోజన పథకం సరకులు పక్కదోవ పడుతున్నప్పటికీ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు.

మల్లిరెడ్డి వెంకట రమణ, తాళ్లూరు

తడి, పొడి చెత్తపై అవగాహన



నెల్లిపూడిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ బాలామణి

శంఖవరం: తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎల్‌పీఓ బాలామణి పంచాయతీ అధికారులకు సూచించారు. మండలంలోని నెల్లిపూడి, మండపం గ్రామాల్లో బుధవారం డీఎల్‌డీఓ పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యర్థాలను రోడ్లపై, డ్రైన్లలో వేయకుండా పంచాయతీ కార్మికులకు అందజేయాలని సూచించారు. తడి, పొడి చెత్తతో వర్మి కంపోస్ట్ తయారు చేస్తారన్నారు.